వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 185
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఏప్రిల్ 21, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## బంగారం ధర @ లక్ష

బంగారం ధర లక్షణంగా లక్షకు చేరింది. ఓవైపు పెళ్లిళ్ల సీజన్ నడుస్తుండగా, మరోవైపు బంగారంపై భారం మరింత పెరిగింది. సోమవారం బంగారం ధర పెరిగి ఏకంగా 10 గ్రాములకు రూ.లక్షకు చేరుకోవడంతో బంగారం కొనాలంటే సామాన్యులు భయపడే పరిస్థితి ఏర్పడింది.
–వరంగల్ వాయిస్, బిజినెస్



# కదం తొక్కనున్న.. గులాబీ దండు

## 27న రజతోత్సవ సభ

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా అక్కడే మకాం వేసి పనులను పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నీ తామై సభను సక్సెస్ చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. అయితే ప్రతిపక్షంలో ఉండి కూడా అధికార పక్షానికి గుండెలదిరేలా ఇంటి పండుగను నిర్వహించేందుకు గులాబీ దండు సిద్ధమవుతోంది. కాంగ్రెస్ పార్టీ చేసిన డిక్లరేషన్లు, గ్యారెంటీల పేరిట చేసిన మోసాన్ని సభావేదికగా ఎండగట్టేలా పక్కా ప్లాన్ తో ముందుకు సాగుతున్నారు. వేదికపైనుంచే 420 హామీల అమలుపై అధికార పార్టీని నిలదీయనున్నారు. దీనితోపాటు ఇప్పటికే నిరాశ, నిస్పృహల్లో ఉన్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులకు ఈ సభ ద్వారా ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు వారిలో మరోమారు ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా గులాబీ బాస్ పక్కా ప్లాన్ వేసినట్లు గులాబీ వర్గాలు చెప్పకొంటున్నాయి. - వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు2లో..

- ముస్తాబవుతున్న ఎల్కతుర్తి
- నిర్వహణకు 1500 ఎకరాల భూసేకరణ
- సభా ప్రాంగణంలో 300 ఎల్ఈడీ స్క్రీన్లు
- అన్నీ తామై చూసుకుంటున్న పోచంపల్లి, దాస్యం



### నవ యవ్వన పార్టీ బీఆర్ఎస్

- రజతోత్సవ సభకు నెల రోజులుగా ఏర్పాట్లు చూస్తున్నాం
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

- భూ సర్వే కోసం రూ.26 వేలు లంచం
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు

జనగామ జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. జిల్లాలోని చిల్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ దాడులు చేయగా.. ఆర్ఐ వినయ్ కుమార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. భూ సర్వే కోసం డబ్బులు డిమాండ్ చేయగా.. బాధితులు రూ.26 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెండ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆర్ఐని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఇదిలా ఉంటే ఇటీవలే జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ లో సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా చిల్పూర్ మండల కేంద్రంలో ఏసీబీ దాడులు జరగడంతో తీవ్ర చర్చగా మారింది.
– వరంగల్ వాయిస్, రఘునాథపల్లి



## త్వరితగతిన ఇండ్ల నిర్మాణం

అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కలెక్టర్ ప్రావీణ్య

8లో..



# కదం తొక్కనున్న.. గులాబీ దండు



- 27న రజతోత్సవ సభ
- ముస్తాబవుతున్న ఎల్కతుర్తి
- నిర్వహణకు 1500 ఎకరాల భూసేకరణ
- సభా ప్రాంగణంలో 300 ఎల్ఈడీ స్క్రీన్లు
- అన్నీ తామై చూసుకుంటున్న పోచంపల్లి, దాస్యం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డిక్లరేషన్లు, గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గట్టి షాక్ ఇచ్చేందుకు సిద్ధపడుతోంది. రజతోత్సవ సభ ద్వారా అధికార పార్టీని ఎండగట్టేందుకు గులాబీ బాస్ ఇప్పటికే అస్త్ర, సస్త్రాలతో సిద్ధంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకొంటున్నాయి. అయితే వేదిక ద్వారా కేసీఆర్ ఇచ్చే సందేశం కోసం దేశమంతా ఎదురుచూస్తోంది. ఈ వేదిక ద్వారా ప్రజల్లో తిరిగి ఉద్యమ స్ఫూర్తిని నింపడంతోపాటు బీఆర్ఎస్ సత్తా చూపేలా వ్యూహ రచన చేస్తున్నట్లు సమాచారం. అయితే పార్టీ అధినేత ఆదేశాలతో సభ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం పర్యవేక్షిస్తూ సభ సక్సెస్ కు కృషి చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి జనం భారీ సంఖ్యలో తరలి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### సందడిగా ఎల్కతుర్తి..

ఉమ్మడి వంరగల్, కరీంనగర్ జిల్లాల సరిహద్దులోని ఎల్కతుర్తి గ్రామం సందడిగా మారింది. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ఈ నెల 2న ఎల్కతుర్తిలో అంకురార్పణ జరిగిన నాటినుంచి నిత్యం వచ్చిపోయే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. అయితే కనీ, వినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఇప్పటికే 1,500 ఎకరాల భూమిని సేకరించారు. సభా స్థలికి 500 మీటర్ల దూరంలో వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి చింతల పల్లి గ్రామానికి వెళ్లే దారిలో 169 ఎకరాల్లో సభ నిర్వహణకు కేటాయించారు. ఇందులోనే 400మంది ప్రతినిధులు కూర్చునేలా 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదికను సిద్ధం చేస్తున్నారు.

### 300 ఎల్ఈడీ స్క్రీన్లు..

వేదికపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ కనిపించేలా సభా ప్రాంగనంతోపాటు వాహనాల పార్కింగ్ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో మొత్తం 300 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. సభను విద్యుత్ అంతరాయాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు 400 కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన జనరేటర్లను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలలనుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలనుంచి 50 వేలకు పైగా వాహనాలు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల భద్రత కోసం పార్కింగ్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.






### మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ..

అసలే వేసవి కాలం..జనం దాహంతో తల్లడిల్లుతారని గుర్తించిన నిర్వాహకులు అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లను చేస్తున్నారు. సభ స్థలితోపాటు పార్కింగ్ ప్రాంతాలు, రోడ్డుకు ఇరువైపులా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 15 లక్షల మజ్జిగ, మరో 15 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా సభ ప్రాంగణానికి సమీపంలో తాత్కాలికంగా 20 పడకలతో ఆస్పత్రి, ప్రధాన రహదారుల్లో నాలుగు వైపులా నాలుగు అంబులెన్స్ లు, నాలుగు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు.

### నిత్యం పర్యవేక్షణ..: పోచంపల్లి, దాస్యం

బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణ ఏర్పాట్లను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు ప్రకటించారు. అయితే ఈ సభ ద్వారా కేసీఆర్ ఎం మాట్లాడుతారోననే ఉత్కంఠ అందరిలో నెలకొందన్నారు. పార్టీ శ్రేణులను, కార్యకర్తలకు ఈ వేదిక ద్వారా ఆయన దిశా నిర్దేశం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

# నవ యవ్వన పార్టీ బీఆర్ఎస్

- రజతోత్సవ సభకు నెల రోజులుగా ఏర్పాట్లు చూస్తున్నాం
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 25 సంవత్సరాల నవ యవ్వన పార్టీ బీఆర్ఎస్ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. నా భూతో నా భవిష్యత్ అనే విధంగా సభ నిర్వహించబోతున్నామని ఆయన ప్రకటించారు. సోమవారం సభా స్థలిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభకు వచ్చే ప్రజలకు అన్ని వసతులు, ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లను అందిస్తామని వెల్లడించారు. ట్రాఫిక్, సభ నిర్వహణకు వాలంటీర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలు కేసీఆర్ స్పీచ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈది పార్టీ సభ కాదు.. ప్రభుత్వంపై తిరుగుబాటు సభ అని ప్రజలే అంటున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో కోపం, కసి ఉందన్నారు. సభలను నిర్వహించడంలో కేసీఆర్ ది ఒక చరిత్ర అన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసినన్ని రాజీనామాలు ఏ నాయకుడు చేయలేదని గుర్తు చేశారు. తెలంగాణకు అన్యాయం జరిగినా, దిగజార్చిన కేసీఆర్ ఊరుకోరన్నారు. వరంగల్ అంటే కేసీఆర్కు ప్రత్యేక అభిమానమన్నారు. జనం గుండెల్లో కేసీఆర్ ఉంటారని గుర్తు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలే అసంతృప్తితో ఉన్నారన్నారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎస్డీఎల్సీ వద్ద సోమవారం 53వ డివిజన్ లో పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్ రావు మేనల్లుడు తక్కళ్లపల్లి వినీల్ రావు, వంద మంది యువకులకు వారు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.















WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఏప్రిల్ 21, 2025

# ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కేంద్రం

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలోని దుర్మార్గరాలనను నిరసిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కాళోజీ సెంటర్ లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజు రోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటినా వాటిని నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, రూపాయి విలువ పతనంతో పతనమైన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. నిత్యావసరాల ధరల పెంపును అరికట్టకుండా బ్లాక్ మార్కెటింగ్ దారులకు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. హిందువులు, ముస్లింల పేరుతో ప్రజలను విడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకుని వచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను సీబీఐ, ఈడీ వంటి రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం చేస్తున్నదని, మాట వినని ప్రతిపక్ష పార్టీ నాయకులపై వాటిని ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. అలాగే బీజేపీ యేతర ప్రభుత్వాలపై గవర్నర్ల వ్యవస్థ తో పెత్తనం చెలాయించాలనే కుట్రను సుప్రీం కోర్టు ఇటీవల తప్పు పట్టిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఊటుకూరి రాములు, మునిగల భిక్షపతి, కొట్టేపాక రవి, కొట్టే వెంకటేష్, వేల్పుల సారంగపాణి, నేదునూరి వెంకటరాజం, బత్తిని సదానందం, మంచాల రమాదేవి, మాలోతు శంకర్, అనుకరి అశోక్, కండె నర్సయ్య, దామెర సుదర్శన్, గుంటి రాజేందర్, ఆదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేట స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం నర్సరీ నుంచి ఒకటవ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉన్నత విద్యలో జరిగే సన్మానాలు, సత్కారాల గురించి తెలియపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియపరిచారు. తద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య పట్ల ఉత్సాహం కలిగి ఆసక్తి కనబరిచి జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంటారని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించడం ద్వారా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్య పట్ల ఆసక్తి కనబరుస్తారని తెలియపరిచారు. విద్యార్థులకు ఉన్నత విద్యలో మంచి విద్యా ప్రమాణాలతో పురోగతి చెందడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేర్ల రజిని, ఉపాధ్యాయులు తస్లీమా, కృష్ణవేణి, బజ్జూరి రజిత, నుస్రత్, పూర్ణిమ, శిల్ప, సాలేహా, విద్యార్థిని విద్యార్థులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటేషన్లలో జరిగిన అక్రమాలపై చర్యలేవి ?

## టీపీటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ విద్యా సంవత్సరంలో వరంగల్ జిల్లా విద్యా శాఖలో జరిగిన వర్క్ అడ్జస్ట్మెంట్ (డిప్యూటేషన్లు) ప్రక్రియలో అనేక అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయని టీపీటీఎఫ్ నేతృత్వంలోని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆరోపించింది. ఫిబ్రవరి 3, 2025న కలెక్టర్ టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఈ డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరింది. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ అధికారిగా ఆర్డీఓని నియమించినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. డీసీఈబీ కార్యాలయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుత డీసీఈబీ సెక్రటరీపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా జిల్లా విద్యా కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను తక్షణమే వారి స్వస్థల పాఠశాలలకు పంపించాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు, బిల్లుల విషయంలో జరుగుతున్న ఆలస్యాన్ని వెంటనే నివారించాలని, ఎయిడెడ్ సెక్షన్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, విభాగాన్ని పూర్తిగా శుద్ధి చేయాలని కోరారు. రిటైర్ అవుతున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులకు గ్యాంట్-ఇన్-ఎయిడ్ మంజూరు చేసి, పెన్షన్ ప్రతిపాదనలను కనీసం ఆరు నెలల ముందుగానే పంపుకునేలా అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో పని చేస్తున్న సర్వీస్ పర్సన్‌లకు కేవలం ఒక్క నెల వేతనం మాత్రమే ఇవ్వడం జరిగింది. మిగతా పది నెలల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఆదాయపన్నును వేతనాల నుంచి మినహాయించకూడదని కోరారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

## బీఆర్ఎస్ నేత గూడ కిరణ్ కుమార్ పిలుపు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజితోత్సవ బహిరంగ సభను ఘనవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు జిల్లా బీఆర్ఎస్ నాయకుడు గూడ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన జనగామ జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బహిరంగ సభలో భారీగా ప్రజలు హాజరయ్యేందుకు మండలాలు, గ్రామాల స్థాయిలో జన సంకల్ప ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. "బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రజలు గ్రామ స్థాయిలో బ్రహ్మరథం పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుంది. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే" అని ఆయన అన్నారు. మండలవ్యాప్తంగా వాల్ రైటింగ్స్, పోస్టర్ల పంపిణీ, గ్రామాల్లో పార్టీ గద్దెల నిర్మాణం తదితర ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఈ సభకు దాదాపు 10 లక్షల మంది హాజరవుతారని, ఇది కనివినీ ఎరుగని రీతిలో జరగనున్న భారీ సభగా మారుతుందని గూడ కిరణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండల పీఆర్టీయూ మండల శాఖ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి దంపతులను సోమవారం ఘనంగా సన్మానించింది. ఐనవోలు మల్లికార్జున దేవస్థానంలో ఎమ్మెల్సీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి ఆనందం, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మండల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, మండల శాఖ అధ్యక్షులు గుర్రపు రాజు, ప్రధాన కార్యదర్శి జూలూరు చంద్రమోహన్, రాష్ట్ర జిల్లా మండల బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, సూరిబాబు, మధుసూదన్ రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్, మైపాల్ రెడ్డి, కిషన్, భవాని, రమేష్, ప్రశాంత్, యాకయ్య, కొమురయ్య, ఐనవోలు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి హనుమకొండ జిల్లా వారి ఆధ్వర్యంలో పరకాల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద్ కుమార్ పర్యవేక్షణలో పరకాల జయ టాకీస్ రోడ్డులో కార్మికులకు, ప్రజలకు ఎండాకాలం దాహార్తిని తీర్చే ఉద్దేశంతో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. పరకాల పరిసర గ్రామాల నుంచి వచ్చే కార్మికులు, ప్రజలు చలివేంద్రంలో ఏర్పాటు చేసిన చల్లని నీరు తాగి దాహార్తిని తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీపతి, బీఎంఎస్ సీనియర్ నాయకుడు అడగాని జనార్దన్ రావు, మంద రాజు, దుప్పటి రమేష్, దుప్పటి భరత్ కుమార్, బొచ్చు కుమార్, మారేపల్లి సుధాకర్, బట్టు రవి, పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ద్వితీయ వార్షికోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీఆర్టీయూ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, చర్లపల్లి గ్రామ మాజీ సర్పంచి చాడ తిరుపతిరెడ్డి, శ్రీ సాయి ట్రస్ట్ అధ్యక్షులు వేముల ప్రభావతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. చాడ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా అన్ని వసతులు కల్పించబడి ప్రైవేట్ పాఠశాలకు దీటుగా రూపొందించబడిందన్నారు. వేముల ప్రభావతి మాట్లాడుతూ శ్రీ సాయి ట్రస్ట్ ద్వారా చర్లపల్లి పాఠశాలకు మా వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, మేకల సత్యపాల్, పోలంపల్లి విజేందర్, నిగ్గుల శ్రీదేవి, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్య, రమేష్, ఆయాలు సరోజన, రమ, సుశీల, అరుణ, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మొరం తరలిస్తున్న టిప్పర్ సీజ్



**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పసరగొండ గ్రామం నుంచి హనుమకొండకు అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ ను ఊరుగొండ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూపించక పోవడంతో టిప్పర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

# విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విశ్వబ్రాహ్మణ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదర్శ విశ్వబ్రాహ్మణ సంక్షేమ భవన ట్రస్ట్ లో విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం 8వ విస్తృత స్థాయి సమావేశం సిద్దోజు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. అధ్యక్షోపన్యాసం అనంతరం సంవత్సర కాలానికి సంబంధించిన కార్యదర్శి, కోశాధికారి నివేదికను సభ్యుల ముందు ప్రవేశ పెట్టగా చిన్న చిన్న సవరణలు, సూచనలతో ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికకు ఎన్నికల అధికారులుగా సహకార సంఘ విశ్రాంత ఉద్యోగులు కలకోట నర్సింహచారి, బింగి లక్ష్మీనారాయణలు వ్యవహరించారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయగా నియమిత స్థానాల కన్న ఎక్కువ నామినేషన్లు రావడంతో సభ్యుల ఆమోదంతో లక్కీ డీప్ ద్వారా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీకి అధ్యక్షుడిగా సిద్దోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద సుధాకర్ రావు, కోశాధికారిగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా ఆకోజు సురేందర్ రావు, సంయుక్త కార్యదర్శిగా తాడూరి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా మట్టెవాడ బ్రహ్మచారి, రాగి కరుణాకర్, సిద్దోజు సూర్యప్రకాష్, శ్రీరామోజు గిరిబాబులను ఎన్నుకున్నారు. సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సంఘ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని నూతన కమిటీ అభిప్రాయపడింది. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# సోనియా, రాహుల్ గాంధీలపై బీజేపీవి కక్ష సాధింపు చర్యలు

**కాంగ్రెస్ నేత లింగాల జగదీష్ చంద్రా రెడ్డి**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జీషీట్‌లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది పూర్తిగా కక్ష సాధింపు రాజకీయాల ఫలితమని వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు లింగాల జగదీష్ చంద్రా రెడ్డి అన్నారు. రఘునాథపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, "ఈడీ ద్వారా కాంగ్రెస్ అగ్రనేతలపై అవినీతి ముద్ర వేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. ప్రజల్లో నమ్మకాన్ని సంపాదించలేని బీజేపీ ఇలా ప్రతిపక్ష నేతలపై దాడుల ద్వారా లబ్ధి పొందాలని చూస్తుందని విమర్శించారు. బీజేపీ నాయకులు బయట గంభీరంగా ప్రవర్తించినా, లోపల మాత్రం రాజకీయ కక్షలను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. "ప్రజల విశ్వాసం అన్ని పరిణామాలను గమనిస్తున్నారని, బీజేపీ ఇప్పటికే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, వారే బీజేపీ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని, మోదీ, బీజేపీలను చంద్రారెడ్డి హెచ్చరించారు.

# మే 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**తాటిపాముల వెంకట్రాములు విజ్ఞప్తి**



వరంగల్ వాయిస్, వరంగల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాల్‌ను జయప్రదం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన జాతీయ వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఈ సమ్మెకు మద్దతు ప్రకటించారని ఆయన వెల్లడించారు. మోదీ ప్రభుత్వం అమలు చేయబోయే నూతన లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తాయని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేయకుండా, కంపెనీల యజమానులకు అనుకూలంగా రూపొందించిన నాలుగు కార్మిక కోడ్లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు మే 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సంఘీభావం తెలపాలని వెంకట్రాములు కోరారు.

# ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**■ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** కలెక్టరేట్‌లో సోమవారం ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. షెడ్యూల్ అభివృద్ధి శాఖలో అవుట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్న ఉద్యోగులు గత కొన్ని నెలలుగా జీతాలు అందకపోవడమే కాకుండా, వారి ఈఎస్ఐ, ఈపీఎఫ్ జమలూ పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు. తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నేడు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 63 దరఖాస్తులు వచ్చినట్లు తెలియజేస్తూ, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. అందులో రెవెన్యూ (33), మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (7), డి.ఆర్.డి.ఓ (5), ఎంప్లాయిమెంట్ (3) తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, తొర్రూరు ఆర్డీవో గణేష్, డీఆర్డీఓ మధుసూదనరాజు, సీపీఓ సుబ్బారావు, డీపీఓ హరిప్రసాద్, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎచ్ఎస్ఓ మరియన్న, బీసీ, ఎస్సీ అభివృద్ధి అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, డీఎం సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, జీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్డీఎం సత్యనారాయణమూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

# మా పార్టీ నేతల మధ్య లోపించిన సమన్వయం




**➲ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లాలో సమన్వయం లోపించిందని, నేతలంతా తాము తామే అనే ధోరణితో వ్యవహరించడం సరైంది కాదని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు ప్రజలను సమీకరించే ప్రక్రియలో నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం బాధాకరమని తెలిపారు. అందరినీ సమంగా నడిపించే నాయకత్వం లోపించిందని వ్యాఖ్యానించారు. పార్టీ నేతల మధ్య సఖ్యత కనబడడం లేదని, కోఆర్డినేషన్ పూర్తిగా లేకపోయిందని అన్నారు. "ఇంతటి ముఖ్యమైన సభకు కనీసం నన్ను ఫోన్ చేయకపోవడం కూడా బాధాకరమని ఆయన వాపోయారు. ఇలాంటి పరిస్థితులు జిల్లాలో కొనసాగితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. సమన్వయ కర్తగా సత్యవతి రాథోడ్ అన్ని వర్గాల నాయకులను కలుపుకొని పోవాలని, గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. నాయకుల మధ్య విభేదాలు, గ్రూప్ రాజకీయాలు కార్యకర్తలలో ఆందోళనను కలిగిస్తున్నాయని ఎమ్మెల్సీ రవీందర్ రావు అన్నారు.

# జలప్రసాద వితరణ అభినందనీయం

**◆ ఇంతెజార్ గంజ్ ఎస్ఐ సందీప్**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వరంగల్ సీకేఎం ప్రసూతి ఆసుపత్రికి వస్తున్న గర్భిణీలు, బాలింతలు, వారి బంధువులకు మండు వేసవిలో చల్లని తాగునీటిని పంపిణీ చేస్తున్న ధరణీసాయి సేవాసంఘ్ సభ్యుల సేవలు అభినందనీయమని ఇంతెజార్ గంజ్ సబ్ ఇన్ స్పెక్టర్ వద్దె సందీప్ అన్నారు. గత 36 రోజులుగా ధరణీ సాయి ఆధ్వర్యంలో కొనసాగుతున్న జల ప్రసాద వితరణ సేవను సోమవారం ఎస్ఐ సందీప్ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రతినెల అమావాస్య, పౌర్ణమి వేళల్లో పేదలకు అన్నదానం, ప్రతీ శుక్ర, ఆదివారాల్లో గోపూజ, గోగ్రాసం గోసేవలో తరిస్తున్న ధరణీ సభ్యుల సేవా నిరతిని ఎస్ఐ సందీప్ కొనియాడారు. ధరణీ సాయి నిర్వాహకులు జి.సుధాకర్, ఆర్.హరిప్రసాద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా దాతల సహకారంతో క్రమం తప్పకుండా సీకేఎం ఆసుపత్రిలో ఎండాకాలంలో అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని జలప్రసాద వితరణ చేస్తున్నామని, ఎండాకాలం ముగిసే వరకు ఈ జలప్రసాదం పంపిణీ కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ధరణీ సాయి సభ్యులు దివ్వెల పూర్ణ, ఆర్.వెంకన్న, ఎ.రవీందర్, జి.బుచ్చన్న, రామేశ్వర్, సతీష్, శంకర్, కుషాల్ చంద్, ఎం.నర్సయ్య, సాయికిరణ్, సాత్విక్, శైలజ, మంజుల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# తాళ్ల రాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

**కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటయ్య డిమాండ్**

**వరంగల్ వాయిస్, జనగామ :** నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్ గ్రామంలో గీత కార్మికులపై జరుగుతున్న సాంఘిక బహిష్కరణను వెంటనే నిలిపివేయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటయ్య డిమాండ్ చేశారు. గత ఆరు నెలలుగా వీడీసీలు గీత కార్మికులను అణచివేస్తూ, వారిని ఉపాధి అవకాశాల నుంచి వంచిస్తున్నారని ఆయన ఆరోపించారు. శ్రీరామనవమి సందర్భంగా గౌడ మహిళలను గుడి నుంచి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలు గౌడ వర్గ ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నాయని, వీడీసీలను నిషేధించాలని ఆయన కోరారు. జనగామ మండలంలోని పసరమడ్ల గ్రామంలో బాల్నే వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ లాంటి ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించి, సాంఘిక బహిష్కరణను ఎత్తివేసి, గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని గౌడ కల్లుగీత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో కుర్రెముల సిద్ధయ్య, కొర్రెముల పరుశరాములు, మార్క ఉపేందర్, కుర్రెముల చంద్రమౌళి, తాండూరి ఆంజనేయులు, రాంపల్లి మైసగౌడ్, కుర్రెముల తిరుపతి, సుదగాని ఆంజనేయులు, దూడల రాజు, కుర్రెముల శ్రీధర్, కన్నా పవన్, కుర్రెముల శ్రీనివాస్ పాల్గొన్నారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఏప్రిల్ 21, 2025

# వక్ఫ్ బిల్లు సవరణ రాజ్యాంగ విరుద్ధం

**➲ ఎంపీ పోరిక బలరాం నాయక్**




**మహబూబాబాద్, వరంగల్ వాయిస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగానికి విరుద్ధమని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ విమర్శించారు. ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నల్ల జెండాలు, జాతీయ జెండాలు, ప్లకార్డులతో వేలాది మంది పాల్గొన్న ఈ ర్యాలీ ఉత్కంఠగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు 13 రోజుల పాటు పోరాడినప్పటికీ, బీజేపీ తన ఏకపక్ష ధోరణితో బిల్లు ఆమోదించిందని విమర్శించారు. ప్రభుత్వ విప్ రామ చంద్రు నాయక్ మాట్లాడుతూ, గత పదేళ్ల బీజేపీ పాలనలో రైతులు, క్రైస్తవులు, ముస్లింలకు అన్యాయం జరిగిందని, వారి హక్కులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకువచ్చిన దృష్టాంతమే ఈ వక్ఫ్ బిల్లు అని మండిపడ్డారు. మునుపటి నల్ల చట్టాలపై పోరాడినట్లే, ఇప్పుడు కూడా సమానంగా పోరాటం కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ, బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని, వక్ఫ్ ఆస్తులను కైవసం చేసుకునే యత్నంగానే ఈ సవరణను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ నిరసన ర్యాలీలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామ చంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళి నాయక్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, సీపీఐ, సీపీఎం, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు తదితరులు భారీగా పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి సామాజిక సేవ శిక్ష

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 43మంది వ్యక్తులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరిచారు. విచారణ అనంతరం నిందితులు పెద్దూరి శ్రీనివాస్, షైక్ గౌస్ లకు రెండు రోజుల సామాజిక సేవ శిక్ష విధించారని ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ ఇద్దరిని ఎంజీఎం వద్ద ఉన్న ప్రొఫెసర్ వెటర్నరీ హాస్పిటల్‌కు సామాజిక సేవ నిమిత్తం పంపినట్లు చెప్పారు. మిగతా 41 మందిపై మొత్తం రూ.51,400 జరిమానా విధించబడింది. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురిని కోర్టుకు హాజరు పరచగా, వారికి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున జరిమానా విధించామని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

## అబాకస్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ జిల్లా కాశిబుగ్గలోని స్టాండర్డ్ ఉన్నత పాఠశాలలో సోమవారం అబాకస్ పోటీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిన రెండవ తరగతి విద్యార్థి పి.విజయవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకర్ రాజు, సైకాలజిస్ట్ రమాదేవి ప్రత్యేకంగా విద్యార్థిని అభినందించారు. విజయవర్ధన్ తరగతిలో కూడా A1 గ్రేడ్ సాధించి ప్రతిభ చాటాడు. ఈ కార్యక్రమంలో అబాకస్ టీచర్ సుష్మ, పాఠశాల ఇన్‌చార్జ్ జయశ్రీ, టీచర్లు భారతి, మహిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి తల్లి లతతో పాటు ఇతర తల్లిదండ్రులు హాజరై విజయవర్ధన్‌ను అభినందించారు.అంతేకాక, ఒకటవ, రెండవ తరగతి విద్యార్థులకు విద్యా ప్రగతి పత్రాలు అందజేసి వారిని పై తరగతులకు అర్హులుగా ప్రకటించారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం కాశిబుగ్గ, చలివేంద్రంలో "18వ" రోజు 29వ పెళ్లిరోజు సందర్భంగా ములుక సురేష్ –మాధవి దంపతులు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్సా కృష్ణ, ఉపాధ్యక్షులు దాసి శివకృష్ణ, మండల చంద్రశేఖర్, పసునూటి శ్రీకాంత్, కానిగంటి పవన్, గాజుల రాజేష్, మామిడాల సతీష్, ఆడెపు సాగర్, కోట నరేష్, వంగ ఐలయ్య, శ్రవణ్, కూరపాటి సతీష్, క్యాతం లక్ష్మీనారాయణ, కందగట్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై కిడ్నాప్, లైంగిక దాడి కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** భూపాలపల్లి జిల్లా గణపురం మండలం రావినగర్‌కు చెందిన ఆకుల సాంబ (29) అనే వ్యక్తికి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో వరంగల్ ఫస్ట్ అడిషనల్ కోర్టు జడ్జి బి. అపర్ణ దేవి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు.వివరాలలోకి వెళ్తే, సీతంపేట గ్రామానికి చెందిన బాధిత బాలిక చిన్నప్పుడే తల్లిని కోల్పోయింది. ఆ తరువాత ఆమెను ఆమె మేనమామ మేకల కుమార్ చూసుకుంటూ వచ్చారు. బాలిక వడ్డేపల్లి చర్చ్ సమీపంలో ఉన్న "సాయి సేవా ట్రస్ట్" ఆధ్వర్యంలోని "స్పందన డీజీ స్కూల్"లో ఏడవ తరగతి చదువుతోంది. అదే స్కూల్ హాస్టల్‌లో ఆకుల సాంబ వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా, అతని ఇద్దరు కుమార్తెలు కూడా అక్కడే ఉంటారు. హాస్టల్‌లో సాంబ తరచూ బాలికతో మాట్లాడేవాడు. ఇది గమనించిన వార్డెన్ అతన్ని మందలించారట. తర్వాత దసరా సెలవుల సందర్భంలో బాలిక సీతంపేటకు తన మేనమామ ఇంటికి వెళ్లింది. అదే సమయంలో హసన్‌పర్తిలో వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చిన ఆమెను ఆకుల సాంబ తన ఇద్దరు పిల్లలతో కలిసి వేములవాడకు తీసుకెళ్లాడు. అక్కడ గుడి సమీపంలోని ఓ సత్రంలో బాలికను చీకటి గదిలో ఉంచి, రాత్రిపూట మాయ మాటలు చెప్పి లైంగిక దాడులకు పాల్పడ్డాడు. తనను భయపెట్టి శారీరకంగా వాడుకున్నాడు. తరువాత బాలిక ధైర్యంగా తన మేనమామకు విషయం చెప్పి, హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేసి, సాంబను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం కేసును విచారించిన ఫస్ట్ అడిషనల్ కోర్టు, నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజా మల్లారెడ్డి వాదించగా, భరోసా లీగల్ ఆఫీసర్ చి.నీరజ, ఏసీపీ రవికుమార్ సమన్వయంతో హసన్‌పర్తి సీఐ చేరాలు కేసును పర్యవేక్షించి, సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.

## పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. గత నెల మార్చిలో మధ్యప్రదేశ్ ఇండోర్లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) ఛాంపియన్ షిప్ లో తెలంగాణ పోలీస్ తరపున ప్రాతినిధ్యం వహించి మూడు వందల మీటర్ల మహిళా జట్టు విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన సుబేదారి ఏఎస్ఐ సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఈ క్రీడలో రాణించేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని పోలీస్ కమిషనర్ సువర్ణకు భరోసా నిచ్చారు. పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

## కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) వరంగల్ ఉమ్మడి జిల్లా నేత రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో తమ న్యాయమైన డిమాండ్లతో నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కలిసి ఆయన మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో గత 20 ఏళ్లుగా పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి, పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలంటే అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## జర్నలిస్టు దీక్షలకు టీడీపీ సంఘీభావం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని జర్నలిస్టు సోదరులు తమకు న్యాయంగా రావలసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గత కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం తరపున మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, జిల్లా సీనియర్ నాయకులు శిర బోయిన రాజు, కాండ్రాతి రాజు తదితరులు పాల్గొన్నారు. దీక్షల సందర్భంగా చిలువేరు రవీందర్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించాలని కోరారు. ప్రజలు, ప్రభుత్వ మధ్య వారధిగా పాత్ర వహిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు ప్రభుత్వ మద్దతు అవసరమన్నారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ పూర్తి సంఘీభావం తెలుపుతుందని పేర్కొన్నారు.

## దర్గా స్టాఫ్ అక్రమ వసూళ్లు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రముఖ యాత్రా స్థలం అన్నారం యాఖూబ్ షావలి దర్గాలో ఏకంగా సిబ్బందే భక్తుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని స్థానిక ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆబర్ల రాజు ఆరోపించారు. దర్గా సిబ్బంది ఇన్ స్పెక్టర్ తో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సిబ్బంది గత 25ఏళ్లుగా ఇక్కడే డ్యూటీ పేరుతో ఉంటున్నారని. వాస్తవానికి అందరూ ఇళ్లలో తమ వ్యాపారాలు చేసుకుంటూ డ్యూటీకి వెళ్లకుండానే ఉదయం హాజరు వేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వీరిని తక్షణమే వేరే దర్గాలకు బదిలీ చేయాలని కోరారు. సిబ్బందిపై చర్యలు తీసుకొని వారి దురాగతాలను అరికట్టాలని అధికారులను రాజు డిమాండ్ చేశారు.

## దామెరలో పశువైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ దీపిక మాట్లాడుతూ రైతులు తమ పశువులకు గాలి కుంటూ వ్యాధి సోకకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. వేసవికాలం అధిక ఎండ తీవ్రత ఉన్నందున రైతులు తమ పశువులను ఉదయం పూట మేతకు తీసుకువెళ్లాలని, తాగడానికి చల్లటి నీరు పశువులకు అందించాలని ఆమె రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర వీఎల్ఓ జి.లక్ష్మణ్, జేవీవో సారంగం, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, శంకర్, సతీష్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొప్పుల రాజును కలిసిన డాక్టర్ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపశిల్పి మాజీ ఐఏఎస్ అధికారి ఏఐసీసీ కార్యదర్శి కొప్పుల రాజు సోమవారం హన్మకొండకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి, పుష్పగుచ్చాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ తో పాటు ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ బీజేపీ పాలనలో ఉపాధి హామీ పథకానికి తూట్లు పడుతుందని కొప్పుల రాజుకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు మోరే ఐలయ్య, మోరే రంజిత్, మంద నవీన్, నాంపల్లి లక్ష్మి, వట్టం జ్ఞానేశ్వరి, చిటికెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు భారీ జన సమీకరణ



**వరంగల్ వాయిస్ నడికూడ :** ఈనెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల మాజీ శాసనసభ్యుడు ధర్మారెడ్డి ఆదేశానుసారం మండలంలోని నార్లపూర్ గ్రామంలో తెలంగాణ రజక సంఘాల సమితి చైర్మన్, ముస్తాబాద్ మాజీ ఎంపీపీ అక్కరాజ శ్రీనివాస్ చేతుల మీదుగా తెలంగాణ రజక సంఘాల సమితి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ బిజినెస్ సెల్ కన్వీనర్ నమిలి నరసింహులు, యూత్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజు, యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు మచ్చ రవీందర్, పిల్లల తిరుపతి, ఒరుగంటి రమేష్, రజక సంగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రవీందర్ కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల మృతిచెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల సంస్కృతం అధ్యాపకుడు రవీందర్ కుటుంబానికి తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ తరపున ఆర్థిక సహాయం చేశారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని ప్రకాష్ రెడ్డి పేట ఫేస్-2లో ఉన్న రవీందర్ నివాసానికి వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తదితర అధ్యాపకులతో కలిసి రవీందర్ భార్య, పిల్లలకు రూ. 25,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాస్ మాట్లాడుతూ, రవీందర్ కుటుంబాన్ని ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఆదుకోవాలని, ఆయన పిల్లల విద్యా ఖర్చులను సంస్థే భరిస్తే మానవతా దృష్టికోణంలో మంచి పని అవుతుందని పేర్కొన్నారు. లెక్చరర్స్ అసోసియేషన్ తరపున దీనిపై వారు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. సతీష్ కుమార్, జేఏస్ డబ్ల్యూటీవీ, సీనియర్ ఇంగ్లీష్ అధ్యాపకులు చిలువేరు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల యుగంధర్, చిర్రా వెంకట్, ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పులి సత్యనారాయణకు సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల:** హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి అడ్వకేట్ పులి సత్యనారాయణ ముదిరాజ్ విజయం సాధించిన సందర్భంగా, మెపా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రవి ముదిరాజ్, నిప్పరి శంకర్ ముదిరాజ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సమాజ జీవన శైలి, స్థితిగతులపై పులి సత్యనారాయణతో చర్చ జరిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి తాము ఎల్లవేళలా తోడుగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం-రైతులకు వరం

- ➲ రాయపర్తిలో అవగాహన సదస్సు
- ➲ హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కలెక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూ హక్కుల రికార్డు పథకం (భూ భారతి చట్టం – ఆర్ఓఆర్) పై రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులను పారదర్శకంగా నిర్వహించి, భవిష్యత్తులో భూ వివాదాలకు ముగింపు పలుకుతామని తెలిపారు. గత పాలనలో అమలైన ధరణి వ్యవస్థ రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. భూ భారతి చట్టం రైతులకు భద్రత కల్పిస్తూ, భూమి హక్కులను సమర్థవంతంగా రిజిస్టర్ చేసేలా రూపొందించబడిందని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రికగా ఈ చట్టం రూపుదిద్దుకున్నదని చెప్పారు. రైతులు తమ భూములపై పూర్తి వివరాలను అందించి, అధికారులతో సహకరిస్తే భూ రికార్డులు అచూకీగా నమోదవుతాయన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భూ పునర్నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఈ చట్టం అమలుతో భూ కబ్జాలు, అక్రమాలు, వివాదాలకి చెక్ పడుతుందని, భవిష్యత్తులో భూ సమస్యలకు అవకాశం ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులను తమ సందేహాలపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు గ్రామస్థాయిలో సర్వేలు ఎలా జరుగుతాయో, భూ నక్షాల పునర్నిర్మాణం ఎలా ఉంటుందో రైతులకు వివరించారు. ఈ అవగాహన సదస్సులో వివిధ శాఖల అధికారులు, నాయకులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, సమ్మయ్య, సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు వక్ఫ్ చట్టంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చౌరస్తాలోని ఎస్ఎసీవి ఫంక్షన్ హాల్ లో గోపాల్ రావు ఠాకూర్ స్మారక సమితి ప్రజ్ఞ భారతి వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం వక్ఫ్ చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ సమ్మిరెడ్డి తెలిపారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమ్మిరెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు చేయాలని సంకల్పించింది దీనికి సంబంధించిన బిల్లును చట్టసభలో ప్రవేశ పెట్టడం ఉభయ సభల్లో బిల్లు పాస్ కావడం జరిగింది. ఈ మధ్యలోనే వక్ఫ్ పేరిట అనేక అనుమానాలను రేకెత్తిస్తూ కొన్ని వర్గాలను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతుంది. కాబట్టి, వక్ఫ్ చట్టంపై దానికి చేయాలనుకునే సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో రేపు సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు హనుమకొండ చౌరస్తాలోనే ఎస్ఎస్వి ఫంక్షన్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు మార్తనేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మాజీ మేయర్ డాక్టర్ టి రాజేశ్వరరావులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం పై కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టించే విధంగా వ్యవహరిస్తున్న తరుణంలో వక్ఫ్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఈ అవగాహన సదస్సుకు సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ రాక సుధాకర్ లు పాల్గొని ప్రసంగిస్తారని, ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ బూర రామ్ చందర్, ప్రజ్ఞాబ్ గారది రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రావు, టి. కిషన్ రావు, జీనుగు విష్ణువర్ధన్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

## ఠంయ్యాల శ్రీధరాచార్యులకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత, గాయకులు,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు -2023 గ్రహీత డాక్టర్ ఠంయ్యాల శ్రీధరాచార్యులను రోజా క్రియేషన్స్ సంస్థ ఘనంగా సన్మానించింది. హాస్య చక్రవర్తి చార్లీ చాప్లిన్ 136 జన్మ దినం సందర్భంగా ఠంయ్యాలను సత్కరించింది. న్యూఢిల్లీ, కర్ణాటక బెంగళూరు, గుజరాత్ సూరత్ లో, మహారాష్ట్ర నగరాలలోని తెలుగు వారికే కాక శ్రీధరాచార్యులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2000 పైగా కార్య క్రమాలను తన మాటలతో పాటలతో అలరించారు. శ్రీధరాచార్యులు డాక్టర్ సినారె, అక్కినేని, నారా చంద్ర బాబునాయుడు, హీరో సుమన్ ప్రముఖుల చేతుల మీదుగా సత్కారాలతో పాటు ఎన్నో అవార్డులు మూడు వందలకు పైగా సన్మానాలు పొందారు. వీరు పాడిన బడిబాట పాట "రారా బడికి రా" రెండు తెలుగు రాష్ట్రాలలో బహుళ ప్రజాదరణ పొందింది. విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాలలో వీరు చేస్తున్న సేవలకు గాను రోజా క్రియేషన్స్ సంస్థ ఠంయ్యాలను సన్మానించింది. తనను సన్మానించినందుకు అతిథులకు, రోజా క్రియేషన్స్ అధినేత అలేటి శ్యాం సుందర్ లకు హృదయపూర్వక ధన్య వాదములు శ్రీధరాచార్యులు తెలిపారు.

## సోషల్ మీడియా సైనికులందరికీ తగిన ప్రాధాన్యం కల్పిస్తాం

◆ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీరెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూర్:** రాయపర్తి మండల స్థాయి సమీక్ష సమావేశం స్థానిక మండల క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సోషల్ మీడియా సైనికులు ముఖ్యమైన పాత్ర పోషించారు. వారి కృషికి ప్రత్యేక ధన్యవాదాలు. భవిష్యత్తులోనూ వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించబడుతుంది" అని పేర్కొన్నారు. పార్టీలో నిజంగా కష్టపడే వారిని గుర్తించి, వారికంటూ ఓ గుర్తింపు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అన్ని స్థాయిలలో కార్యకర్తలు ఐక్యతగా పనిచేయాలని, ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయడాన్ని గమనిస్తూ, అలాంటి విమర్శలకు సమర్థవంతంగా సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరంగా తెలియజేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సోషల్ మీడియా కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించారు. త్వరలో అమలులోకి రానున్న 'రాజీవ్ యువ వికాసం'పథకం దీనికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాయపర్తి మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బండి రాజేంద్ర ప్రసాద్, మండలంలోని అన్ని గ్రామాల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## నవ్వులు పూయించే సారంగపాణి జాతకం ..



దేవీ మూవీస్ బ్యానర్‌పై నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన 'సారంగపాణి జాతకం' చిత్రాన్ని దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించారు. ప్రియదర్శి, రూపా కొడువయూర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. వైవిధ్యమైన వినోదం 'సారంగపాణి జాతకం'లో యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్ వంటి అన్ని అంశాలు ఉన్నాయి. ఇంద్రగంటి చెప్పిన కథ విన్నప్పుడు చాలా ఉత్సాహం కలిగింది. ఈ చిత్రం థియేటర్‌లో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతుంది. జంధ్యాల గారి స్టైల్‌లో పూర్తి వినోదాత్మక చిత్రం చేయాలన్న కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఈ చిత్రం చాలా కాలం ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. 'జెంటిల్‌మాన్', 'సమ్మోహనం' తర్వాత మా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహనకృష్ణ రాసిన కథ, కథనం అందరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీ, యూత్ ఆడియెన్స్‌ను సమానంగా అలరిస్తుంది. సమ్మర్ హాలిడేస్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నాం ఫస్ట్ హాఫ్ పూర్తిగా వినోదాత్మకంగా, సెకండ్ హాఫ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటు–ంది. జాతకం చుట్టూ తిరిగే కథ ఆసక్తికరంగా, సస్పెన్స్‌తో కూడి ఉంటుంది. అయితే, అతి సంక్లిష్టంగా కాకుండా అందరినీ ఆనందపరిచేలా ఉంటుందన్నారు. కథలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంది. వెన్నెల కిషోర్, వైవా హర్ష, నరేష్, అవసరాల శ్రీనివాస్ వంటి నటులు నవ్వులు పంచుతారు. పాత్రలు సహజంగా కథలో భాగమై ఉంటాయి, బలవంతంగా జోడిరచినట్లు అనిపించవన్నారు. ఏప్రిల్ 18న థియేటర్లు సరిగ్గా దొరక్కపోవడంతో ఏప్రిల్ 25కి మార్చాం. ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ ఎత్తున, ఓవర్సీస్‌లో 220కి పైగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నామనిపేర్కొన్నారు.

## కర్నాటకలో ప్రత్యక్షమైన ఎన్టీఆర్

- ప్రశాంత్ నీల్ సినిమా కోసం వచ్చినట్లు సమాచారం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తుంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్ హీరోగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత వచ్చిన దేవర చిత్రంతో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నాడు. దేవర తర్వాత ఎన్టీఆర్ ఏ హీరోతో సినిమా చేయనున్నాడు, షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతాడు, ఎప్పుడు పూర్తి చేస్తాడు అనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. ఇప్పుడు అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు యంగ్ –టైగర్ ఏప్రిల్ 22 నుంచి కర్ణాటకలో జరగనున్న షూటింగ్ లో పాల్గొననున్నాడు. ఎన్టీఆర్ హైదరాబాద్ ను వదిలి కర్ణాటకకు వెళ్లాడు. ర్ణాటక వెళ్తూ ఎయిర్‌పోర్టులో తన నిర్మాతలతో మాట్లాడుతూ కనిపించాడు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ని తమ కెమెరాలలో బంధించారు. ఎన్టీఆర్ లుక్ అయితే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడు లేనంత సన్నగా , స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. జాకెట్ లాంటి షర్ట్, కళ్లకు అద్దాలు పెట్టు–కుని తన లుక్‌తో ఆకట్టుకున్నాడు ఎన్టీఆర్. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాలో ఎన్టీఆర్ ను నీల్ చాలా కొత్తగా ప్రెజెంట్ చేయాలని చూస్తున్నట్టు– తెలుస్తోంది. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా ఆడియన్స్ కు నెక్ట్స్ లెవెల్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుందని చిత్ర యూనిట్ చెప్తోంది. ఇటీ–వల ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ–లో మొదలైంది. ఈ క్రేజీ మూవీ సెట్స్‌లోకి ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు అడుగు పెడతాడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. ఎన్టీఆర్ సెట్స్ లో అడుగుపెట్టబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ.. మారణహోమానికి ముందు ప్రశాంతత.. అంటూ ఎన్టీఆర్ షూటింగ్ కోసం స్టార్ట్ అయిన వీడియోను షేర్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లలో నవీన్ యెర్నేని, రవిశంకర్, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ యూనిక్ మాస్ విజన్‌తో ఎన్టీఆర్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఇది సినీ ఇండస్ట్రీలో సరికొత్త మైలురాయిని సృష్టించనుందని అంటున్నారు.







## అందుకే ఆ కసరత్తు..



కేజీయఫ్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా మారిపోయిన యష్, కాస్త గ్యాప్ తీసుకొని ప్రస్తుతం టాక్సిక్ సినిమాలో నటిస్తున్నాడు. గీతు మోహన్‌దాస్ డైరెక్షన్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. యశ్ 19వ సినిమాగా వస్తున్న దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో యష్ రెండు భాగాలుగా తెరకెక్కబోతున్న హిందీ చిత్రం రామాయణ్‌లో రావణ పాత్ర వేయబోతున్నారు. కేజీఎఫ్' సిరీస్ సినిమాలతో రాఖీ భాయ్‌గా దేశ వ్యాప్తంగా తిరుగులేని అభిమానులను సంపాదించుకున్నాడు క్రేజీ స్టార్ యష్. అదే జోష్‌తో మరో మహత్తర సినిమాకు పూనుకున్నారు అదే 'రామాయణ'. ఇక రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తుండగా రావణ బ్రహ్మ పాత్రలో యష్ నటిస్తున్నారు. బాబిడియోల్ హనుమంతుడిగా కనిపించనున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకుంది. అయితే తాజాగా 'రామాయణ' కోసం అన్నగారు ఎన్టీఆర్ సెంటిమెంట్ ఫాలోఅవుతున్నారట యష్. ఇంతకీ ఏంటా సెంటిమెంట్ అంటే.. చాలా వరకు పౌరాణిక సినిమాల్లో నటించే సమయంలో, రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా మన నటులు నియమ నిబంధనలు పాటించేవారట. ఈ విషయంలో అన్నగారు ఎన్టీఆర్ చాలా మందికి ఆదర్శంగా నిలిచారు. ఆయన నటించిన పౌరాణిక సినిమాల సమయంలో పాత్రని బట్టి ఆయన చాలా నిష్టగా ఉండేవారని ప్రచారం. ఆయన సెంటిమెంట్‌ని కొంత మంది ఇప్పటికి పాటిస్తున్నారు. దీంతో తొలి సారి రావణుడి పాత్ర కోసం యష్ కూడా ఆనాటి సెంటిమెంట్‌ని పాటిస్తుండటం విశేషం. నిష్టగా ఉంటూ పాత్రకు న్యాయం చేసేందుకు పాటుపడుతున్నారు.

## పిల్లల కోసమే నటనకు దూరంగా ఉన్నా

అలనాటి
నటి రంభ మనసులో మాట

అలనాటి హీరోయిన నటి రంభ సినిమాలకు దూరమై 15 ఏళ్లు గడిచాయి. ప్రస్తుతం ఓ టీవీ రియాలిటీ షోకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పిల్లల కోసం ఇంతకాలం పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వచ్చిందని అన్నారు. వివాహం అనంతరం కెనడాలో స్థిరపడినట్లు వెల్లడిరచారు. ఇప్పుడు మళ్లీ తెరపై కనిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు– తెలిపారు. నా పిల్లలకు ఒక వయసు వచ్చేవరకూ తల్లిగా పూర్తి బాధ్యత తీసుకున్నాను. వారిని దగ్గరుండి చూసుకున్నాను. ఇప్పుడు మా బాబుకు 6 ఏళ్లు. కుమార్తెలకు 14, 10 ఏళ్లు. వాళ్లు ఇప్పుడు ఎవరిపైనా ఆధారపడకుండా పనులు చేసుకుంటున్నారు. వాళ్లను చూసుకోవడం కోసమే నేను ఇన్నేళ్లు సినిమాలకు దూరమయ్యాను. కానీ, నాకు సినిమాలపై ఉన్న ఆసక్తి నా భర్తకు తెలుసు. ఆయన ప్రోత్సాహంతోనే ఈ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించేందుకు అంగీకరించానని వివరించారు. మొదటిసారి ఇండస్ట్రీక్రి వచ్చినప్పుడు ఎలా భయపడ్డానో ఇటీ–వల ఈ కార్యక్రమం కోసం డ్యాన్స్ వేసినప్పుడు అంతే భయపడ్డాను. వ్యాన్‌లో నుంచి కిందకు రావడానికి కూడా సంకోచించాను. కానీ, ఒక్కసారి స్టేజ్ మీద డ్యాన్స్ వేశాక అందరి చప్పట్లు– నాలో భయాన్ని పోగొట్టాయి. 30 ఏళ్ల క్రితం మేజిక్ మరోసారి రిపీట్ అయిందన్నారు. ఇటీ–వల ఒక ప్రారంభోత్సవానికి వచ్చాను. అక్కడి జనాలు నాపై ఎంతో ఆదరణ చూపారు. వారు నన్ను ఆదరించిన తీరు చూసిన తర్వాత నాకు సినిమాలపై మరోసారి ఆసక్తి కలిగింది. 15 ఏళ్లు దూరమైనప్పటికీ నటన నా రక్తంలోనే ఉంది. నాతో పాటు ఇండస్ట్రీక్రి వచ్చిన ఎంతోమంది నేటికీ నటిస్తూనే ఉన్నారు. అందుకే నేను కూడా మరోసారి వెండితెరపై కనిపించాలని నిర్ణయించుకున్నానని నటిరంభ వివరించారు.

# త్వరితగతిన ఇండ్ల నిర్మాణం

◆ అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ వాయిస్, రాయపర్తి :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బేస్మెంట్, రూఫ్ లెవెల్ లెవల్ లలో ఉన్న నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన పనులకు బిల్లులు చెల్లింపు చేయడం జరిగిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రాయపర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, టీజీ ఈడబ్ల్యూఐడిసి డీఈ రామిశెట్టి రవీందర్, ఏఈ కామిశెట్టి మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ ఉన్నారు.

## ప్రజావాణిలో 120 అర్జీలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, వరంగల్ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీఆర్డీఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల వారీగా 120 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ సమస్యలపై 45 దరఖాస్తులు, మిగతా శాఖలకు సంబంధించిన 75 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు భద్రత కల్పించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందించనుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మానస పుత్రికగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రెవెన్యూ అధికారులకు చట్టం ద్వారా పూర్తి అధికారాలు కల్పించడం వల్ల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై తాము ప్రత్యక్షంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు పేర్కొన్నారు. భూభారతి చట్టం అమలుతో రైతులు, వారి వారసులు భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలతో బాధపడాల్సిన అవసరం ఉండదని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో ఫణి చంద్ర, మాజీ ఎంపీపీ భాషని చంద్ర ప్రకాష్, దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చింతం రవి పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ పదవి సగరులకే కేటాయించాలి

◆ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ పదవి సగరులకే కేటాయించాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ పట్టణంలోని కేయూ ఎదురుగా ఉన్న ఎన్ఎస్ బంకెట్ హాలులో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగాయి. ఈ సమావేశాలు హనుమకొండ జిల్లా సగర సంఘం, హనుమకొండ సగర సంక్షేమ సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా ఈ సందర్భంగా సగర కుల గురువైన భగీరథ మహర్షి ఫొటో వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇటీవల శ్రీ రామ నవమి సందర్భంగా భాగ్య నగర్ నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర చేసి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందజేసినందుకు తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మర్క సురేష్ సగరను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులకు భద్రకాళీ అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరించారు. సమావేశానికి కుల సంఘానికి సేవ చేసి అసువులు బాసిన సీత భద్రయ్యతో పాటు పలువురికి రెండు నిముషాలు మౌనం పాటించి సానుభూతి ప్రకటించారు.

**సగరులకు అండగా ఉంటా :**

**- ఎమ్మెల్యే నాయిని**

సగరులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో సగరులకు సీట్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, జిల్లా అధ్యక్షుడు నలుబాల సతీష్ సగర, ప్రధాన కార్యదర్శి కుర్మిండ్ల కుమారస్వామి సగర, కోశాధికారి మంగునూరి రఘు సగర, కార్పొరేటర్ గుంటి స్వప్న-శ్రీనివాస్ సగర, హనుమకొండ సగర సంక్షేమ సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు సీత కమలాకర్ రావు సగర, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్ సగర, సగర సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొడిపాక గణేష్ సగర, నాయకులు సీత రమేష్ సగర, కుర్మిండ్ల సదానందం సగర, గుజ్జరి అరుణ్ సగర తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ బిక్షాటన

◆ బిల్లులు చెల్లించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన



**వరంగల్ వాయిస్, పరకాల :** పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సర్పంచ్ బిక్షాటన చేసాడు. వివరాల్లోకి వెళితే పరకాల నియోజకవర్గం నడికుడ తాజా మాజీ సర్పంచ్ రవీందర్ రావు తాను చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్నాయంటూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేసాడు. చేసిన పనులకు బిల్లు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. దీంతో తనకు ఆత్మహత్యే శరణ్యం అంటూ ఆరోపించారు. గత ప్రభుత్వం బిల్లులు వెంటనే రిలీజ్ చేసేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవ్వరికీ చెప్పుకోవాలి అర్థం కానీ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సర్పంచ్ బిక్షటన చేస్తూ నిరసన తెలిపారు. తక్షణమే బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా సర్పంచుల గోడు విని తక్షణమే బిల్లులు చెల్లించాలని రవీందర్ రావు కోరారు.



# 'దీకొండ'కు ప్రశంసా పత్రం

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన కమ్యూనిటీ మధ్యవర్తుల శిక్షణ కార్యక్రమంలో మూడు రోజుల పాటు శిక్షణ పొందిన హసన్‌పర్తికి చెందిన దీకొండ భిక్షపతిని సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ సీ.హెచ్. పంచాక్షరి, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు, వరంగల్ జిల్లా న్యాయ అధికారి గీతా మాధురి చేతుల మీదుగా భిక్షపతికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రజల్లో తరచూ ఎదురయ్యే చిన్నతన తగాదాలను పోలీసు, న్యాయ శాఖ సూచనల మేరకు చర్చల ద్వారా పరిష్కరించాలని, కమ్యూనిటీ మధ్యవర్తిగా స్వచ్ఛందంగా సేవలందిస్తూ సామాజిక సమతుల్యతకు తోడ్పడాలని సూచించారు. తనకు ఈ అవకాశం కల్పించిన న్యాయ సేవాధికారి, రాష్ట్ర సెక్రటరీ పంచాక్షరికి, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబుకి, గీతా మాధురికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# శివాంజనేయ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

**మంత్రిని కోరిన సీనియర్ నాయకుడు రాందేవ్**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉర్సు 40వ డివిజన్ పరిధిలోని శివాంజనేయ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసి రాందేవ్ కోరారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేశారు. శివాంజనేయ దేవస్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గతంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆర్య సమాజీకులు ఓంకారం జెండాతో ఇక్కడి నుంచే బయలు దేరి ఉర్సు గుట్ట వద్ద ఉన్న మందిరంపై ఈ జెండా కట్టిన తర్వాతే రావణ వధ కార్యక్రమం నిర్వహించేవారన్నారు. అదే విధంగా ఇక్కడ భవాని మాత, ఆంజనేయ స్వామి దీక్షలు అధికంగా జరుగుతాయన్నారు. అయినప్పటికీ ఆదాయ వనరులు లేక ఆలయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఆలయాన్ని ఎండోమెంట్ లో మెర్జ్ చేసి ఆలయ కమిటీని వేసి అభివృద్ధికి మంత్రి పాటుపడాలని రాందేవ్ కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com